# సంక్రాంతి ప్రాముఖ్యత

సంక్రాంతి పండుగ మనము జరుపుకొనే పండుగలన్నిటిలో విశిష్టమైనది. దీనిని పల్లెటూళ్ళలో బాగా జరుపుతారు. సంక్రాంతి అనగానే మనకు గంగిరెద్దులు, హరిదాసులు, గొబ్బెమ్మలు, కోడిపందెములు మొదలైన విషయాలు గుర్తు వస్తాయి. సాధారణముగా ఈ పండుగ పంట చేలు కోసిన అనంతరం వస్తుంది. అంటే ఇళ్ళు ధనంతోనూ, గాదెలు (ఆహార ధాన్యాలు నిలువచేసే ప్రదేశం) ధాన్యంతోనూ నిండిన సందర్భంగా కొడుకు-కోడలు, కూతురు-అల్లుడు ఆదిగా బంధువులతో జరుపుకొనే వేడుక ఇది.

పంటల కోతలకారణంగా క్రిమికీటకాలు ఇంటిలో ప్రవేశించకుండా ఆవు పేడతో ఇంటి వీధి వాకిలిలో కల్లాపి చల్లుతారు. ఆవు పేడ మంచి క్రిమిసంహారిని. ఆ వాసన తగ్గించేందుకు, అందముగా తీర్చి దిద్దేందుకు పిండితో ముగ్గులు పెడతారు. గొబ్బెమ్మలు పెట్టడంలో ఉద్దేశ్యం కూడా ఇదే. వరి పిండితో ముగ్గులు పెట్టడంవల్ల, అది చీమలు మొదలైన వాటికి ఆహారముగా, భూతదయకు ఆస్కారము కలుగుతుంది. అంతే కాక అవి ఇంటిలోనికి త్వరగా ప్రవేశించవు. అందుకే బంధువులతో వున్న ఆ ఇళ్ళలో అసౌకర్యము కలుగ కుండా వుండేందుకే పండుగ సమయాలలో ముంగిళ్ళు ముగ్గులతో కళకళ లాడాలని చెప్తారు. ఈ సందర్భంలో ఇంటికి బూజులు దులిపి, గోడలకు వెల్లవేస్తారు. పసుపు రాసిన గడపలతో, మామిడి తోరణాలతో, బంధువులతో పల్లెలు ఆనంద నందన (ఆ నందనందన) వనాలే అవుతాయి.

ఆదరణ తగ్గి చెక్క భజనలు, దాసరికాలు లాంటి కళారూపాలు అంతరించిపోతున్నాయి. సంక్రాంతి పండుగ ఐదు రోజులు జరుపుకొనేవారు. ఇందులో మొదటి రోజు భోగి. తెల్లవారుఝామున భోగి మంటలు వేస్తారు. అనంతరం నలుగు పెట్టుకొని స్నానం చేస్తారు. పాత వస్తువులను విసర్జిస్తారు. పాతవస్త్రములను విడచి క్రొత్త దుస్తులను ధరిస్తారు. సాయంత్రము బొమ్మలకొలువు (వివిధ దేవతా విగ్రహాలను, ఆట బొమ్మలను ఓ క్రమంలో ఆకర్షణీయంగా అమరుస్తారు) తీర్చి దిద్ది, ఇరుగు పొరుగు స్త్రీలను పేరంటానికి పిలుస్తారు. ఆహ్వానితులకు కాళ్ళకు పసుపురాసి, మెడకు గంధము పూసి, కుంకుమతో నుదుట బొట్టు పెట్టి, వారిని బట్టలు, శనగలు, ఫల, పుష్ప, చందన, తాంబూలములతో సత్కరిస్తారు. పిల్లలకు రేగుపళ్ళు, అక్షతలు, పువ్వులు, చిల్లర నాణెములు కలిపిన భోగిపళ్ళు పోసి దీవిస్తారు.

రెండవ రోజు మకర సంక్రాంతి. ఈ రోజు సూర్యుడు కర్కాటక రాశి నుండి మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. ఈ రోజు క్రొత్తగా పండిన బియ్యం (వరి) వండి దేవునికి నైవేద్యం పెడతారు. మకర సంక్రాంతికి ముందు నెల రోజులను ధనుర్మాసము అంటారు. ద్వాపరయుగంలో గోపికలు ధనుర్మాసకాలములో కాత్యాయని వ్రతమాచరించి శ్రీకృష్ణుని ప్రేమ పొందారని, తదనంతరము ఆండాళ్ అమ్మవారు తిరుమలేశుని వివాహమాడగోరి ఈ వ్రతం చేసి స్వామివారితో భోగం పొందెనని ప్రతీతి. ఈ రోజే భోగిగా ప్రసిద్ధి పొందింది. ఈ రోజున వైష్ణవ దేవాలయములలో లక్ష్మీనారాయణ కళ్యాణం వైభవంగా జరుపుతారు. ధనుర్మాసంలో కన్నెపిల్లలు సూర్యోదయానికి ముందే లేచి మంచి భర్తను పొందాలని కోరుకుంటూ ముంగిట ముగ్గులు పెట్టి, గొబ్బెమ్మలు (ఆవు పేడని ముద్దలు చేసి, పువ్వులతో, పసుపుకుంకుమలతో అలంకరిస్తారు) మధ్యలో పెట్టి ఆ ముగ్గులచుట్టూ తిరుగుతూ పాటలు పాడటం పరంపరగా మిగిలింది. ఈ రోజులలో తాత ముత్తాతల పేరుమీద అన్నదానము, వస్త్రదానములు చెయ్యడం వలన వారికి ఉత్తమ గతులు కలుగుతాయని, వారి ఆశీర్వాదములు దాతలపై ఉంటాయని భావిస్తారు.

మూడవరోజు కనుమ. ఈ రోజు పశువులను పసుపు కుంకుమలతో అలంకరించి పూజిస్తారు. రైతులు పాలు, పెరుగులకు ఆధారపడే ఆవులు, గేదెలను, మేకలను - వ్యవసాయానికి తోడ్పడే ఎద్దులను, దున్నలను, ఇంకా వివిధములైన పెంపుడు జంతువులను అలంకరించి పూజిస్తారు. నాల్గవ రోజు ముక్కనుమ. జీవనాధారమైన పనిముట్లను, వాహనాలను అలంకరించి పూజ చేస్తారు. వ్యవసాయానికి వాడే బండ్లను, ట్రాక్టర్లను, నాగలి, పలుగు, పార, ప్రయాణానికి వాడే కారు, స్కూటరు, సైకిలు, వృత్తి నిమిత్తము వాడే కుట్టు యంత్రాలను మొదలైన వాటిని అలంకరించి పూజిస్తారు. ఇక ఐదవరోజు తీర్థం లేదా పరస. వివిధ అలంకార సామాగ్రి, తినుబండారములు, ఆహ్లాదకరమైన వస్తువులతో దుఖాణాలు తెరుస్తారు. ఈ పర్వ దినములలో పోలేరమ్మ, ముత్యాలమ్మ, నూకాలమ్మ మొదలైన గ్రామదేవతలను కొలిచి జాతరలు నిర్వహిస్తారు. పల్లెలు పాడి పంటలతో కళకళలాడాలని తద్వారా దేశం సుభిక్షంగా వుండాలని పూజలు చేస్తారు.

కోడిపందెములు, గొఱ్ఱిపందెములు జరిపి ఆనందిస్తారు. కమ్మని వంటకాలను బంధువులతో కూడి ఆరగిస్తారు. ఎవరి శక్తి మేరకు వాళ్ళు దానధర్మాలు చేస్తారు. దివంగతులైన తాత ముత్తాతలను స్మరిస్తూ పురోహితులకు పిండి వంటలతో భోజనము పెట్టి క్రొత్త బట్టలతో సత్కరిస్తారు. గంగిరెద్దులవాళ్ళు ఇంటింటికి తిరిగి పాతబట్టలను గ్రహిస్తారు. హరిదాసులు హరికీర్తనలను పాడుచూ బియ్యాన్ని స్వీకరిస్తారు. వారు దానం స్వీకరిస్తూ దానం చేసేవారి పాపాల్ని హరిస్తారని చాలామంది నమ్మకము. పాత వస్త్రాలను వదలి క్రొత్త దుస్తులను ధరించడంలో జీవుని జనన మరణ ప్రక్రియ గోచరిస్తుంది. జీవి జీర్ణమైన శరీరాన్ని వదలి ఎలా క్రొత్త శరీరాన్ని ధరిస్తాడో తెలియజెప్పే వేదాంతధోరణి కానవస్తుంది. మహాభారత సమయంలో భీష్ముడు ధనుర్మాస కాలములోనే, అంపశయ్యపై ఉండగా, విష్ణు సహస్రనామ స్తోత్రం పాండవులకు ఉపదేశించి - అనంతరము ఏకాదశి రోజున వైకుంఠము చేరెనని ప్రతీతి. ఆ కారణము చేత ఈ ఏకాదశిని వైకుంఠ ఏకాదశి లేదా భీష్మైకాదశి అని కూడా అంటారు.

అన్నపూర్ణగా పేరుగాంచిన మన ఆంధ్రభూమిలో ఈ పండుగకు ప్రత్యేక స్థానం ఉంది. ఇందులో మనము చేసే ప్రతి పనికి ఓ విశేషం ఉంది. ఈనాడు ఇది అంతా చాదస్తం అని కొట్టి పడేస్తున్నా వాస్తవానికి ఈ ప్రక్రియల వల్లు క్రాంతి, శాంతి, విశ్రాంతి దొరుకుతాయి అనడం ఎంత మాత్రమూ అతిశయోక్తి కాదు.

సర్వే జనా: సుఖినోభవంతు.

## గొబ్బిపాట

గొబ్బియెళ్ళో గొబ్బియెళ్ళో

చెలియాలందరు గొబ్బి పాటలు పాడరే

సర్వమునకు సృష్టికర్త

సర్వేశ్వరుడొకడున్నాడే

సర్వేశ్వరునీ ఘనతా

చక్కాగా వినిపించారే

నల్లగ నుండునా లేక

తెల్లగ నుండూనా

ఎట్టి గుణము కలవాడు

ఎవరికి మంచీవాడే

దుష్టగుణము మనలో ఉంటే

చేరీ బుద్ధులు చెప్పూనే

గొబ్బియెళ్ళో గొబ్బియెళ్ళో

చెలియాలందరు గొబ్బి పాటలు పాడరే

ఇలా సాగుతాయి గొబ్బిపాటలు.